క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలని వినతి



కేంద్రమంత్రికి వినతిపత్రం అందజేస్తున్న సుధాకర్ రావు

కొందుర్గు: చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేనేత విభాగం బీజేపీ రాష్ట్ర కన్వీనర్ సుధాకర్ రావు శుక్రవారం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే రాజా సింగ్‌తో చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించినట్లు సుధాకర్‌రావు తెలిపారు. ప్రస్తుతం చేనేత కార్మికులు ఉపాధిలేక గ్రామాల్లో దుర్బర జీవితం అనుభవిస్తున్నారని, వారి బతుకులు మారేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరాములు, శివకుమార్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి

ఎస్‌ఐ రాజ్‌కుమార్

కేశంపేట: విద్యార్థులు చట్టాలపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ రాజ్‌కుమార్ పేర్కొన్నారు. మండల పరిధిలో కొత్తపేట గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు నూతన చట్టాలు, యాంటీడ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. చెడు వ్యాసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. నూతన చట్టాల ప్రకారం శిక్షలు కఠినంగా ఉన్నాయని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బందితో పాటు పోలీస్ సిబ్బంది కృష్ణయ్య, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐసీసీ పెద్దలను కలిసిన పొల్యూషన్ బోర్డు మెంబర్



లేఖను అందిస్తున్న సత్యనారాయణ రెడ్డి

చేవెళ్ల: హైదరాబాద్ గాంధీభవన్‌లో శుక్రవారం ఏఐసీసీ పెద్దలను రాష్ట్ర పొల్యూషన్ బోర్డు మెంబర్ చింపుల సత్యనారాయణ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పార్లమెంటు ఎన్నికల్లో చేవెళ్ల నియోజకవర్గంలో పార్టీ ఓటమికి గల కారణాలను వివరిస్తూ రాసిన లేఖను ఏఐసీసీ నిజనిర్ధారణ కమిటీ సభ్యులకు ఆయన అందజేశారు. ఆయనతో పాటు పలువురు నాయకులు పెద్దలను కలిశారు.

వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న మహిళలు

చేవెళ్ల: మండల కేంద్రంలోని కొనగట్టు భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవాలయంలో శుక్రవారం వారాహి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల్లో పాల్గొనేందుకు పలు గ్రామాల నుంచి మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అమ్మవారిని ప్రత్యేక అలంకరణ చేసి, పూజలు నిర్వహించి, నైవేథ్యం సమర్పిస్తే కోరిన కోరికలు నెరువేరుతాయనేది ప్రజల నమ్మకమని ఆలయ ప్రధాన అర్చకుడు సురేశ్ పేర్కొన్నారు.

మీర్‌పేటవాసికి సేవారత్న అవార్డు

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధి గాయత్రినగర్‌కు చెందిన కసిరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డిని కురుగంటి కళాక్షేత్రం, చారిటబుల్ ట్రస్ట్ 2024 సంవత్సరానికి గాను సేవారత్న అవార్డుకు ఎంపిక చేసింది. తెలంగాణ ప్రభుత్వ భాషా, సంస్కృతి శాఖ సహకారంతో శుక్రవారం నగరంలోని రవీంద్రభారతిలో కంచర్ల శ్రీనివాస్(శ్రీ రామదాసు 10వ తరం) చేతుల మీదుగా వెంకటేశ్వర్‌రెడ్డికి అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్‌రెడ్డి మా ట్లాడుతూ.. వీటీ రాయల్ ఫౌండేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని, ఈ అవార్డుతో తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. భవిష్యత్తులోనూ తన ఫౌండేషన్ తరఫున మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతానన్నారు. కురుగంటి కళాక్షేత్రం 27వ వార్షికోత్సవం సందర్భంగా సేవారత్న అవార్డుకు ఎంపిక చేసిన కురుగంటి రాధిక సుదర్శన్ దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉప కేంద్రాల్లో అందని వైద్యం!

వేధిస్తున్న సిబ్బంది కొరత | పల్లె వాసులకు కరువైన చికిత్స | ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులు | పట్టించుకోని ఉన్నతాధికారులు



మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



శిథిలావస్థకు చేరుకున్న ఆరోగ్య ఉప కేంద్రం

కేశంపేట: నిరుపేదలకు ఉచిత వైద్యం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను, గ్రామాల్లో ఉప కేంద్రాలను ఏర్పాటు చేసింది. కొన్ని రోజులుగా ఆరోగ్య కేంద్రాల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ప్రజలకు ప్రభుత్వ వైద్యం అందని ద్రాక్షగా మిగిలింది. దీంతో నిరుపేదలకు, మధ్య తరగతి ప్రజలకు ప్రభుత్వ వైద్యం కరువైంది.

ప్రైవేట్ ఆస్పత్రులే దిక్కు...

రోగం వస్తే నయం చేసుకునేందుకు 5 వేల జనాభాకు ఒక్క ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఐతే సిబ్బంది కొరతతో వీటి నిర్వహణ సక్రమంగా లేవు. మరోవైపు ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా ఉచిత వైద్యం ప్రజలకు శాపంగా మారింది. ప్రజలకు రోగాలు వస్తే ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. వచ్చీ రాని వైద్యంతో ఆర్ఎంపీలు చేసే చికిత్సనే నమ్ముకోవలసిన దుస్థితి నెలకొందని రోగులు ఆవేదన్య వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో 8 సబ్ సెంటర్లు...

మండలంలో 28 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో వైద్యం అందించేందుకు 8 ఉప కేంద్రాలను ఏర్పాటు చేశారు. మండంలోని పాపిరెడ్డిగూడ, కొండారెడ్డిపల్లి, తొమ్మిదిరేకుల, లేమామిడి, కొత్తపేట, కేశంపేట, ఎక్లాస్‌ఖాన్‌పేట, తొమ్మిదిరేకుల గ్రామాల్లో ఆరోగ్య ఉప కేంద్రాలు ఉన్నాయి. వీటిలో పాపిరెడ్డిగూడ, ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామాల ఉప కేంద్రాలకు తప్ప మిగతా ఎక్కడ కూడా పక్కా భవనాలు లేవు. పాపిరెడ్డిగూడ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం ఇరుకుగా ఉంది. అక్కడ సిబ్బంది కూర్చోడానికే స్థలం లేకపోవడంతో రోగులు, సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని పట్టించుకునే వారు కరువయ్యారు.

ఖాళీలను భర్తీ చేయాలి...



మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 33 మంది సిబ్బంది అవసరం. పూర్తి స్థాయి సిబ్బంది లేక పోవడంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. చాలా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వెంటనే ప్రభుత్వం స్పందించి ఖాళీలను భర్తీ చేయాలి

- మూల్తూంకార్ శివాజీ, కేశంపేట గ్రామం

బదిలీల్లో సిబ్బంది రావొచ్చు..



ప్రస్తుతం బదిలీల ప్రక్రియ కొనసాగుతుంది. అందులో భాగంగా పూర్తి స్థాయిలో సిబ్బంది నియమించొచ్చు. అప్పటికీ సిబ్బంది కొరత ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తాం.

- డాక్టర్ నిఖిత, మండల వైద్యాధికారి, కేశంపేట మండలం

వేధిస్తున్న సిబ్బంది కొరత...

మండలంలోని 8సబ్‌సెంటర్ల పరిధిలో 1వ ఏఎన్ఎం 8 మందికి గాను ఒక్కరే ఉన్నారు. అలాగే 2వ ఏఎన్ఎం 8మంది అవసరం ఉండగా 7 గురు ఉన్నారు. సిబ్బంది కొరతతో ఇద్దరు ఏఎన్ఎంలు చేయాల్సిన సేవలను ఒక్కరు మాత్రమే నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో వారు పని ఒత్తిడికి గురవుతున్నారని చెబుతున్నారు. 1వ, 2వ ఏఎన్ఎంలు సబ్ సెంటర్ల పరిధిలో వైద్య సేవలను అందించడంతో పాటు ప్రతీ చేసిన విధిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది.

మానవ మనుగడకు మొక్కలు అవసరం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



షాద్‌నగర్: మొక్క నాటుతున్న ఎమ్మెల్యే శంకర్



మొక్కకి నీరు పోస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

షాద్‌నగర్: మానవ మనుగడకు మొక్కలు అవసరమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వన మహోత్సవం కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం షాద్‌నగర్ పట్టణంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మొక్కల పెంపకంతో వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించొచ్చన్నారు. భవిష్యత్తు తరాల వారికి మంచి వాతావరణాన్ని అందించాలంటే ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. ప్రజల మనుగడకు చెట్లు ఉండాలని, రోడ్ల వెంబడి, ప్రభుత్వ స్థలాల్లో, పొలం గట్లపై విధిగా మొక్కలు పెంచాలన్నారు. ఈ విషయంలో సమాజంలోని ప్రతీ పౌరుడు బాధ్యతగా వ్యవహరించి మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. ప్రభుత్వం యజ్ఞంలా నిర్వహిస్తున్న వనమహోత్సవ కార్యక్రమంలో ప్రజలందరూ స్వచ్ఛందంగా పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, నాయకులు బాబర్‌ఖాన్, తిరుపతిరెడ్డి, ఇబ్రహీం, చెట్ల పావని నర్సింహ్మా, విశాల విశ్వం, కృష్ణవేణి, జూపల్లి కౌసల్య, శంకర్, సరిత, యాదగిరి యాదవ్, జీటీ శ్రీనివాస్, ఖదీర్, ముబారక్, కమిషనర్ వెంకన్న, డాక్టర్ రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలి: ఎమ్మెల్యే యాదయ్య

శంకర్‌పల్లి: గ్రామాల్లో నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య పేర్కొన్నారు. వనమహోత్సవంలో భాగంగా శంకర్‌పల్లి మండలంలోని మసానిగూడ గ్రామంలో ఆయన మొక్క నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చెట్లు లేకపోతే మానవాళి మనుగడ కష్టమన్నారు. ప్రస్తుతం నిర్మాణాల పేరుతో విపరీతంగా చెట్లను నరుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకయ్య, ఎంపీఓ గీత, ఏపీఓ, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయానికి ప్రతీక బోనాలు

ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి



బోనాల ఉత్సవంలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

షాద్‌నగర్: తెలంగాణ సంప్రదాయానికి ప్రతీక బోనాలు అని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్‌లో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో బోనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆషాఢ మాసంలో ఆడ బిడ్డలు పుట్టింటికి వచ్చి గ్రామ దేవతలను పూజించే సంప్రదాయం పురాతన కాలం నుంచి వస్తున్న ఆచారమని గుర్తు చేశారు. తెలంగాణలో ప్రజలు ఈ పండుగను అత్యంత వైభవంగా జరుపుకుంటారన్నారు. గ్రామ దేవతలకు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, నాయకులు ఈశ్వర్ రాజు, జూపల్లి శంకర్, పిల్లి శేఖర్, సంతోష్, గడ్డం నందు, చెరుకు బాబయ్య, అంబటి శేఖర్, చెరుకు శివ, సుశాంత్, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



పెద్దమంగళారం వ్యవసాయి పొలంలో వేలాడుతున్న విద్యుత్ తీగలు

మొయినాబాద్: వ్యవసాయ పొలంలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. తలకు తగిలేఅంత ఎత్తులో కిందికి ఊగుతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల పరిధిలోని పెద్దమంగళారం సూర్యదేవాలయం సమీపంలోని వ్యవసాయ పొలాల్లో విద్యుత్ తీగలు వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. ఆవైపుగా రైతులు, స్థానికులు, పశువులు వెళ్లితే తగిలేంత ఎత్తులో ఉండటంతో వారు భయాందోళనకు గురవుతున్నారు. వేలాడుతున్న విద్యుత్ తీగలను వెంటనే సరిచేయాలని రైతులు ఎన్నోసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం కరిగెట్లు చేసే సమయం దగ్గర పడటంతో విద్యుత్ తీగల కింద ఎలా పనిచేయాలని రైతులు భయపడుతున్నారు. ఇప్పటికైనా ఈ విషయంలో విద్యుత్ అధికారులు స్పందించి విద్యుత్ తీగలను సరిచేయాలని కోరుతున్నారు.

పంటల నమోదు వేగవంతం చేయండి

కొందుర్గు: ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగుచేసే పంటలను నమోదు చేసే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని మండల వ్యవసాయాధికారి శిరీష సూచించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆమె ఏఈఓలతో మాట్లాడారు. పంటల నమోదు ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని, పంటల నమోదులో తప్పులు దొర్లితే ఏఈఓలే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. పంటల నమోదులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రభుత్వం తీసుకునే చర్యలకు బాధ్యులవుతారని హెచ్చరించారు.

సీజనల్ వ్యాధులు సోకకుండా అరికట్టాలి

మండల ప్రత్యేక అధికారి రాజరత్నం



మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి రాజరత్నం

కేశంపేట: సీజనల్ వ్యాధులు సోకకుండా అరికట్టాలని మండల ప్రత్యేక అధికారి రాజరత్నం పేర్కొన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం డెంగ్యూ మరియు సీజనల్ వ్యాధులపై వైద్య ఆరోగ్య శాఖ, ఐసీడీఎస్, పంచాయతీ రాజ్ సిబ్బందితో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజరత్నం మాట్లాడుతూ ఆరోగ్య శాఖ, ఐసీడీఎస్, పంచాయతీ రాజ్ మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సంయుక్తంగా డెంగ్యూ, సీజనల్ వ్యాధులు విజృంభించకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. గ్రామాల్లో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, విద్యాశాఖ అధికారులతో కలిసి అవగాహన సమావేశాలు నిర్వహించాలన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ రవిచంద్రకుమార్ రెడ్డి, ఎంపిఓ కిష్టయ్య, మండల వైద్యాధికారి డాక్టర్ నిఖిత, మండల ఇన్‌చార్జి విద్యాధికారి మనోహర్, ఏపీఎం భగవంతు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

దైవ చింతనతో మానసిక ప్రశాంతత

అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఎమ్మెల్యే కాలె యాదయ్య



స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యే యాదయ్యను సన్మానించిన ఆలయ సభ్యులు

చేవెళ్ల: దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఎమ్మెల్యే కాలె యాదయ్యలు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఇంద్రారెడ్డి నగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన పోచమ్మ విగ్రహప్రతిష్ఠాపనోత్సవంలో పాల్గొన్నారు. శుక్రవారం వారు అమ్మవారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతీఒక్కరు భక్తి భావాన్ని పెంచుకోవాలన్నారు. మూడు రోజుల నుంచి పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా ఈ వేడుకలు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి భీంభరత్, మాజీ డీసీసీ అధ్యక్షుడు పడాల వెంకట్‌స్వామి, యాంకర్, సినీ నటుడు బిత్తిరి సత్తి, మండల కాంగ్రెస్ అధ్యక్షురాలు సమతారెడ్డి, సున్నపు వసంతం, మాజీ జెడ్పీటీసీ మాలతి కృష్ణారెడ్డి, మాజీ సర్పంచి శైలజ ఆగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యతో ఉజ్వల భవిష్యత్

రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి ఈవీ వేణుగోపాల్‌రావు



విద్యార్థులకు గోల్డ్ మెడల్స్, డిగ్రీ పట్టాలను అందజేస్తున్న ఈవీ వేణుగోపాల్‌రావు

మొయినాబాద్ రూరల్: ఉన్నత విద్య పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి ఈవి వేణుగోపాల్ రావు పేర్కొన్నారు. అమ్డాపూర్ చౌరస్తాలోని జేబీఐఈటీ ఇంజనీరింగ్ కళాశాలలో 13వ గ్రాడ్యుయేషన్ డేను జేబీ గ్రూప్ విద్యా సంస్థల కార్యదర్శి కృష్ణారావు ఆధ్వర్యంలో ఘనంగా గురువారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవీ వేణుగోపాల్ రావు విద్యార్థులకు డిగ్రీ పట్టాలతోపాటు గోల్డ్, సిల్వర్ మెడల్స్‌ను అందజేశారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేటి ప్రపంచంలో నాణ్యమైన విద్య అభ్యసించడంతో పాటు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. అనుకున్న లక్ష్యాన్ని సాధించాలంటే క్రమశిక్షణ, విజ్ఞానంతో కూడిన విద్య అవసరమన్నారు. టాలెంట్ ఎక్రిజేషన్ లీడర్, యాప్ అసోసియేట్ మదన్‌మోహన్ బంగారి మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు ప్రాజెక్టులు ఆవిష్కరణల ప్రదర్శన ఈవెంట్‌లు ఎంతో ఉపయోగపడుతాయని సూచించారు. కవరేజీ గ్రాడ్యుయేట్‌ల విజయాలను హైలెట్ చేయడమే కాకుండా భవిష్యత్తు తరాలకు ఉపయోగపడేలా స్ఫూర్తినిస్తాయన్నారు. 2024 సంవత్సరంలో 430 మంది బీటెక్, ఎంటెక్, ఎంబీఏ విభాగాల్లో డిగ్రీ పట్టా తీసుకున్నారన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసమే ఈ విద్యా సంస్థను తల్లిదండ్రులు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు కృషి చేసినప్పుడే వారు ఉన్నత స్థాయికి ఎదుగుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ అవార్డు గ్రహిత ఎస్‌వి విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కొలకలూరి ఇనాక్, జేబీ విద్యా గ్రూప్స్ సంస్థ కార్యదర్శి కృష్ణారావు, కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ సిహెచ్ సంజయ్, ప్రిన్సిపల్ డాక్టర్ పిసి కృష్ణమాచారి, రాజశేఖర్‌రెడ్డి, ఫార్మసీ ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, వివిధ కళాశాలల హెచ్‌వోడీలు, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



ఎమ్మెల్సీని సన్మానిస్తున్న కౌన్సిలర్లు



సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి

మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో సభ్యుల డిమాండ్

షాద్‌నగర్: షాద్‌నగర్ మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కౌన్సిల్ సభ్యులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. పారిశుద్ధ్య కార్మికుల సంఖ్యను పెంచాలని, పట్టణంలో అన్ని వార్డుల్లో పారిశుద్ధ్య పనులు సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పట్టణంలోని చాలా కాలనీల్లో వీధి లైట్లు వెలగడం లేదని, దీంతో రాత్రి వేళల్లో కాలనీల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. పట్టణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు కోసం గతంలో తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే అమలు చేయాలని, హైమాస్టు లైట్లు మరమ్మత్తులు చేయాలని కోరారు. పట్టణంలో కుక్కల బెడద అధికంగా ఉందని సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. వార్డుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని సభ్యులు కోరారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే మున్సిపాలిటీలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. పట్టణ అభివృద్ధిలో అందరు భాగస్వాములు కావాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వెంకన్న, వైస్ చైర్మన్ ఎంఎస్ నటరాజన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డికి ఘన సన్మానం

ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డిని శుక్రవారం షాద్‌నగర్ మున్సిపాలిటీ పాలక మండలి సభ్యులు ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్సీగా ఎన్నికైన తర్వాత తొలిసారిగా కౌన్సిల్ సమావేశానికి విచ్చేసిన నవీన్‌కుమార్‌రెడ్డిని పూలమాలలు వేసి, శాలువా కప్పి కౌన్సిలర్లు, నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ కొందూటి నరేందర్, వైస్ చైర్మన్ ఎంఎస్ నటరాజన్, వెంకట్‌రాంరెడ్డి, ఈశ్వర్ రాజు, బచ్చలి నర్సింహ్మా, కొందూటి మహేశ్వరి, కౌసల్య, ప్రేమలత, పావని, లతాశ్రీ, పావని, అగ్గనూరు విశాల, జూపల్లి శంకర్, పిల్లి శేఖర్, యాదగిరి యాదవ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పక్కనే చెత్తా చెదారం

- ఈగలు, దోమల స్వైరవిహారం
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



మొయినాబాద్‌లో రోడ్డు పక్కనే పేరుకుపోతున్న చెత్తా

మొయినాబాద్: మొయినాబాద్ మండల కేంద్రంలో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. రోడ్ల పక్కన, వీధుల్లో, ఖాళీ స్థలాల్లో ఎటు చూసినా చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి. పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో ఈగలు, దోమలతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ గ్రామ పంచాయతీ పరిధిలో గత కొంత కాలంగా కొత్త కాలనీలు అధికంగా వెలిశాయి. దానికి తోడు మండల కేంద్రం కావడంతో షాపులు, హోటళ్లు, చికెన్ షాపులు చాలా ఉన్నాయి. వాటి నుంచి వెలువడే వ్యర్థపదార్థాలను రోడ్ల పక్కనే ఎక్కడ పడితే అక్కడ పారబోస్తున్నారు. ఇళ్లలోని చెత్తను సైతం గ్రామ పంచాయతీ సిబ్బంది సరిగా సేకరించకపోవడంతో వీధుల్లోనే పడేస్తున్నారు. కాలనీల్లో అక్కడక్కడ ఉన్న ఖాళీ స్థలాలు, ప్లాట్లలోనూ చెత్తా చెదారం వేస్తున్నారు. మరో పక్క మొయినాబాద్ పంచాయతీకి డంపింగ్ యార్డు లేకపోవడంతో సురంగల్ వెళ్లే రోడ్డు పక్కనే చెత్తను డంప్ చేస్తున్నారు. అది ఊరికి దగ్గరగా ఉండటంతో దుర్వాసన వెదజల్లడంతో పాటు, ఈగలు, దోమలు గ్రామంలోకి చేరుతున్నాయి. గ్రామంలోని వీధులు, రోడ్ల పక్కన, ఖాళీ స్థలాల్లో సైతం చెత్తా చెదారం ఉండటంతో ఈగలు, దోమలు ఇళ్లలోకి చేరడంతో రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం కావడంతో డెంగీ వంటి రోగాలు వచ్చే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా చేపట్టాలని ప్రజలు పంచాయతీ అధికారులకు చెప్పినా వారు పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుద్ధ్య నిర్వహణను సక్రమంగా చేపట్టాలని కోరుతున్నారు.